# మౌనం

**జయంతి కాలేజీలో నా క్లాసుమేట్. మేం చాలా చనువుగా వుండేవాళ్లం అప్పుడు. ఇప్పుడు కూడా మా యింటికి దగ్గరగానే వుండడం చేత తరుచు వస్తూ వుంటుంది. జయంతి నవ్వుతూ వచ్చి కూర్చుంది.**

"ఎప్పుడూ పనేనా, మాధవీ!"

"ఏం చెయ్యమంటావు. ఇల్లు అన్న తర్వాత పని తప్పదు కదా."

"పని మనిషి లేదా?"

"లేకేం. వుంది. కాని కొన్ని పన్లు కొందరు చేస్తే బాగుండవు. ఉతికి ఆరేసిన బట్టలు నేను మడత పెట్టుకుంటేనే నాకు నచ్చుతుంది. అలాగే... అది తోమిన స్టీలు సామాన్లన్నీ రాక్‌లో నేను సర్దుకుంటేనే నాకు తృప్తి. "పని" అన్నది చేస్తూ వుంటే అలా ఏదో పని కనిపిస్తూనే వుంటుంది నాకు! పని చెయ్యడంలోనే నాకు చెప్పలేని ఆనందం కలుగుతుంది జయంతీ! మన స్వహస్తాలతో కమ్మగా వంటచేసి భర్తకి, పిల్లలకి వడ్డించి వాళ్లు తింటూంటే వాళ్ల మొహాల్లో కనిపించే సంతోషం... పనిమనిషిచేత హోటల్ నుండి తిండి తెప్పించి పెట్టేస్తే వుంటుందా చెప్పు!... సరేలే, ఛాన్స్ దొరికింది కదా అని ఏదో వాగేస్తున్నాను... ఏమిటి విశేషాలు... చెప్పు".

జయంతి కొంచెం చిన్నబుచ్చుకున్నట్టుగా నాకనిపించింది. నేను అనేముందు ఆలోచించాల్సింది! తప్పు చేసాను. కారణం- జయంతి ఇంటిపని- వంటపని పట్టించు కోదు. ఎప్పుడు ఏది తినాలని అనిపించినా, దోసెలు, పూరీలు, సమోసాలు, పరోటాలు ఏవైనా హోటలుండే తెప్పించుకుంటుంది.

జయంతి వెంటనే నవ్వేస్తూ అంది "మా పక్కింట్లో బాబాగారి భజన అవుతుంది. చాలా మందిని పిల్చారు వాళ్లు. నన్నుకూడా నాకు తెల్సిన వాళ్లని పిలవమని చెప్పారు. రేపు సాయంత్రం నీకు వీలవుతుందా?"

"తప్పకుండా వస్తాను. ఎన్ని గంటలకి?"

"సాయంత్రం ఆరు నుండి ఏడు వరకు. అన్నట్లు చెప్పడం మర్చిపోయాను. ఆ భజనకి లలితాదేవిగారు కూడా వస్తున్నారు!"

"ఆవిడెవరు?"

"ఆవిడా?... అమ్మో, చాలా గొప్పావిడ... దైవాంశ సంభూతురాలు. సాక్షాత్ ఆ లలితాదేవి అమ్మవారు ఆవిడలో వుందంటారు అందరూ. క్రిందటిసారి మా పక్కింట్లో భజన అయినప్పుడు ఆవిడ వచ్చింది. నువ్వు వస్తే ఆవిడ్ని చూసే అవకాశం వుంటుంది. ఆశీర్వాదం కూడా తీసుకోవచ్చు."

"అలాగే వస్తాను. ఇంకేమైనా విశేషాలుంటే చెప్పవే."

"అవునూ, నీకీ విషయం తెలుసా?"

"ఏం సంగతే? చెప్తే కదా తెలుస్తుంది!" "ఏమిటా విషయం?" అన్నాను నవ్వుతూ.

"ఇక్కడ అక్కయ్యపాలెంలో 'అవధూత' అని ఒకాయన వున్నారు తెలుసా?"

"అవధూత- అంటే?"

"ఆయనొక సర్వ సంగపరిత్యాగి. మా పక్కింటావిడ అతన్ని చూడ్డానికి రమ్మని పిలిస్తే వెళ్లాను. ఆ అవధూతగారికి నాలుగువందల సంవత్సరాలట. కాని చూడ్డానికి నలభై ఏళ్లవాడిలా వున్నాడు. గడ్డం కూడా నల్లగానే వుంది. పెళ్లాం, ఇద్దరు పిల్లలు. పదేళ్ల బాబు, ఎనిమిదేళ్ల పాప!"

నాకు గట్టిగా నవ్వాలనిపించింది. నవ్వితే జయింతిక్కోపం వస్తుందేమోనని వూరుకున్నాను. జయంతి ఇంకా చెప్పింది: "అలాంటి అవధూతలు మనదేశంలో మూడువేలమంది వున్నార్ట."

"అలాగా. నన్ను రమ్మని పిలిస్తే నేను కూడా వచ్చి చూసేదాన్నిగా".

అవధూత!... సర్వసంగ పరిత్యాగి! కాని సంసారం చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలు! "సర్వ సంగ పరిత్యాగి"కి అర్థం తెలీదేమో దానికి! పోనీ యిప్పుడు దానికి చెప్పి నేనేం సాధిస్తాను?! అయినా మనిషికి వందేళ్లు దాటితేనే టి.వి.లో ఇంటర్వ్యూలు, గిన్నిస్ బుక్‌లోకి ఎక్కడాలు జరిగిపోతున్నాయి!! అలాంటిది నాలుగు వందల సంవత్సరాలు దాటిన అవధూత మన విశాఖపట్నం... అక్కయ్య పాలెంలో వుంటే... అందరూ తెలిసి ఊరుకున్నారా? ఆశ్చర్యంగా వుంది. జయంతి ఎవరేది చెప్పినా గుడ్డిగా నమ్మేస్తుంది. దానికి భక్తి ఎక్కువ. భక్తి పేరు చెప్పి దాన్ని సులువుగా బుట్టలో వేసుకోవచ్చు! ఎవరైనా నేను అలాంటివి నమ్మను. అలాగని దానితో వాదించను. ఎవరికి నచ్చిన మార్గంలో వాళ్లు వెళ్లనీ. శాసించడానికి, తర్కించడానికి, నా మార్గమే సరైనదని చెప్పడానికి నేనెవర్ని?! ఎదుటి వాళ్లు 'తప్పు' చెప్పినా అది తప్పు అని నేను అనను వాళ్ల మనసుల్ని బాధ పెట్టడం, వాళ్ల తప్పుల్ని సరిదిద్దడం నా అభిమతం కాదు. ఈ విషయంలో మావారు ఎప్పుడూ నన్ను కోప్పడతారు.

"నీ పద్ధతి, ఆలోచనా విధానం: సరైనవి కాదేమో మాధవీ! ఒక్కసారి ఆలోచించు. వాళ్ల తప్పు వాళ్లకి తెలిసేలా చెప్పకపోతే ఎప్పటికీ అది 'తప్పు' అని వాళ్లు తెలుసుకోలేరు!" అంటారు.

"అయి వుండొచ్చు. కాని వాళ్లు చెప్పింది విని, వాళ్ల మూర్ఖత్వానికి, అజ్ఞానానికి మనసులో బాధ పడ్డం తప్పితే వాళ్ల మనసుని బాధ పెట్టలేను. లేనిపోని తంటా లెందుకు?" అంటాను నేను.

"ఇంకో విషయం నీకు చెప్పాలి మాధవీ!" అంది జయంతి ఎంతో ఉత్సాహంగా. "ఈ మధ్య తుని నుండి ఒక ఫొటోగ్రాఫర్ ఎక్స్‌కర్షన్‌కి వెళ్లి అక్కడొక గోతిలో అఖండమైన వెలుతురు మధ్య ఆంజనేయస్వామిని చూసాడట. వెంటనే కెమేరాతో ఫొటో తీద్దామనుకునే లోపల అఖండమైన కాంతి అందులోంచి రాగానే అతను స్పృహతప్పి పడిపోయాట్ట. అతని రెండు కళ్లూ ఆ కాంతికి తట్టుకోలేక పోయాయిట. ఆ తరువాత అతన్ని హాస్పిటల్‌లో జాయిన్ చేసినా అతను బ్రతకనే లేదుట. ఆంజనేయ స్వామి చిరంజీవి కదా. అక్కడున్నాడన్న మాట!"

"అంటే... ఆ హనుమంతుడు యిప్పటిదాకా ఎవ్వరికీ కనబడనే లేదా?".

ఏం చెప్పాలో తెలీక నావైపు వింతగా చూసింది జయంతి.

మర్నాడు నేను జయంతి ఇంటికి వెళ్లాను. మేమిద్దరం కల్సి వాళ్ల పక్కింటికి వెళ్లాం. అప్పటికే

హాలంతా జనంతో నిండిపోయివుంది. మాకు వెనక వరసల్లో స్థలాలు దొరికాయి.

జయంతి మోచేత్తో నన్ను పొడుస్తూ "అదుగో చూడు: ఆవిడే, నేను చెప్పిన లలితా దేవి!" అంది. అటు చూసాను. నుదుట పెద్ద కుంకుమ బొట్టు, నెరసిన జుట్టు, ఎర్రటి పట్టుచీర, ఎర్ర జాకెట్టు, రెండు చేతులకి ఎరుపు, ఆకుపచ్చ గాజులు; మనిషి నిండుగా వుంది. జయంతి నెమ్మదిగా అంటున్నాది. "ఆవిడ్ని చూసావా మాధవీ! ఆవిడ్ని అందరూ లలితాదేవి అమ్మవారికి ప్రతిరూపం అనే అంటారు. మన సమస్యలు. కష్టాలు, రోగాలు: ఏవైనా సరే, ఆవిడ ఒక్కసారి మన నుదురు తాకిందంటే అన్నీ తీరిపోతాయి! ఆవిడ మనమనసులో ఏముందో ఆవిడ కనిపెట్టేస్తుంది. మనం నోరు విప్పి ఏమీ చెప్పక్కర్లేదు. అంతా ఆవిడే చెప్పేస్తుంది. అంతటి మహిమలు వున్నాయి ఆవిడలో!" అంది. నేను ఆశ్చర్యపోయి ఆవిడ్నే చూడసాగాను.

"మరొక విషయం! నలుపురంగు కల్సిన ఏ బట్టలు వంటిమీద వేసుకున్నా అంటే లోపల లంగా నలుపుదైనా సరే ఆవిడకి తెల్సిపోతుంది. అలా నలుపురంగు బట్టలు వేసుకున్న వాళ్లని ఆవిడ తాకదు. దీవించదు. దగ్గరకు వెళ్లదు."

"అదెలా సాధ్యం, ఇదంతా చాలా తమాషాగా వుందే."

"అదంతే మాధవీ! క్రిందటిసారి ఆవిడ వచ్చినప్పుడు ఏం జరిగిందో చెప్పనా? ఆవిడ వచ్చిందని చెప్తే నేను వచ్చాను యిక్కడికి. ఆవిడ అందరికీ బొట్టు పెట్టి నుదురు తాకి దీవించి పంపుతున్నాది. నన్ను మాత్రం పిలవలేదు. నా దగ్గరకు రాలేదు. నాలో టెన్షన్ పెరిగిపోయింది. అప్పుడు చూసుకున్నాను నేను కట్టుకున్న చీరని! ఆ చీరలో అక్కడక్కడ చిన్న నలుపు రంగు గళ్లు వున్నాయి, అంతే. వెంటనే ఇంట్లోకి వచ్చి ఆ చీర మార్చేసి మరొక చీర కట్టుకుని వెళ్లాను. అప్పుడు... ఆవిడ చిరునవ్వుతో నా దగ్గరకు వచ్చి బొట్టు పెట్టి ఆశీర్వదించింది! ఆవిడకి అన్ని పవర్స్ వున్నాయి తెలుసా!"

"అలాగా!" అన్నాను... జయంతి అలా మాట్లాడుతూనే ఉంది, నెమ్మదిగా.

కొంతసేపటికి భజన పూర్తయింది. అందరూ ఆవిడ దగ్గరకు వెళ్తున్నారు బొట్టు పెట్టించుకుని దీవెనలందుకోవడానికి. జయంతి కూడా వెళ్లింది. రవికెల గుడ్డ, పసుపు, కుంకం, నూట పదహార్లు పెట్టి ఆవిడకి యిచ్చింది. ఆవిడ జయంతిని దీవించింది. నాకు సడన్‌గా ఒక విషయం గుర్తుకొచ్చింది! వళ్లంతా చెమట్లు పట్టేసాయి. ఏం చెయ్యాలో తోచడం లేదు. జయంతి మాటల్ని బట్టి చూస్తే ఆవిడ ఖచ్చితంగా నన్ను పిలవదు. బొట్టు పెట్టదు. దీవించదు. జయంతి అక్కణ్ణించి గట్టిగా పిలుస్తున్నాది "రావే!" అంటూ. నేను ఏదో తప్పుచేసినట్లు దిగులు చెందేను. కారణం - నా లోపలి లంగా నలుపుది!? ఇంతలో ఆవిడే నన్ను రమ్మని పిల్చింది. "రామ్మా! అక్కడే నిలబడిపోయావేం, రా" అని. నేను వెళ్లాను. నాకు బొట్టు పెట్టినా తలమీద చేయి వుంచి చాలాసేపు మనసులోనే ఏదో దీవించింది! నేను ఆశ్చర్యపోయాను. వెంటనే జయంతికి నా నల్ల లంగా గురించి చెప్పేద్దామనుకున్నాను. కాని చెప్పలేదు. దాని నమ్మకాన్ని నేనెందుకు వమ్ము చెయ్యాలి! అందరూ లేచి ప్రసాదాలు అందుకుంటూ అటు-యిటు హడావుడిగా తిరుగుతున్నారు. ఇంతలో ఎవరో అన్నారు. "చూడండి. సింహాసనం కదులుతోంది కదూ" అని.

వెంటనే జయంతి అటే చూస్తూ "అవునవును. కదుల్తోంది. బాబా మహిమ అంతా!" అని లెంపలేసుకుంటూ సాష్టాంగపడింది. అప్పటికే అక్కడ అయిదారుగురు మూగారు. సింహాసనం కదలడం "నాకు కనిపిస్తున్నాది... అంటే నాకూ కనిపిస్తున్నాది" అంటూ.

నాకు మాత్రం ఆ "కదలడం" కనిపించలేదు. అయినా వాళ్లతో వాదించడం యిష్టంలేక వూరుకున్నాను. ఒకవేళ "కనిపించలేదు" అంటే "పాపాత్ములకి అది కనిపించదు!" అని ఎవరైనా అనేస్తే నా పరువేం కాను?! సరిగ్గా ఆ టైంలోనే వాళ్ల పక్కింటి ఆవిడకి లలితాదేవి పూనిందట. ఆవిడ ఒకటే ఊగిపోతున్నాది. అందరూ చేతులెత్తి దణ్ణాలు పెట్టేస్తున్నారు. ఆవిడ అలా ఊగుతూనే సమాధానాలు చెప్తున్నాది. అంత పూనకంలోనూ ఆవిడ నన్ను చూసి నవ్వి పలకరించింది.

"ఏమండీ. బాగున్నారా?" అని.

"ఆఁ" అన్నట్టుగా తలూపాను నేను.

పూనకం వచ్చిన మనిషికి కాస్సేపు వంటిమీద స్పృహ వుండదు. మరి ఇదేమిటి??! అక్కడ జరిగేది చూడ్డమే కాని ప్రశ్నలు అడిగే హక్కు నాకు లేదు.

భక్తి అనేక రకాలు. కొంతమంది దేవుడ్ని మనసులోనే ధ్యానిస్తారు. "భగవంతుడా! నన్ను ఎల్లప్పుడూ కాపాడు. నాచేత పాప కర్మలను చేయించకు. నీతిని-నిజాయితీని తప్పకుండా; ఎవరికీ అన్యాయం చెయ్యకుండా, ఎవరి అన్యాయానికి గురికాకుండా వుండేలా చూడు. ఈ సంసార సాగరాన్ని దాటడానికి నాకు తోడుగా నిలువు" అని వీలున్నప్పుడల్లా మనసులోనే ప్రార్థిస్తారు.

మరి కొంత మంది వంటపని, యింటిపని వదిలేసి, భర్త-పిల్లల్ని పట్టించుకోకుండా అదే పనిగా గంటల తరబడి పూజలు చేసేస్తూ, భారీ ఎత్తున నైవేద్యాలు పెట్టేస్తూ వీళ్లు ఎంత భక్తులో నలుగురికీ తెలిసేలా ప్రవర్తిస్తారు!! ఇంకా కొంతమంది భజనలు పెట్టి పదిమందినీ పిల్చి ఆ వేళకి పూనకం వచ్చిందని వూగిపోతూ వుంటారు.

భజన చెయ్యడం అన్నది సత్కాలక్షేపమే. భజన మనసుని ఆహ్లాద పరుస్తుంది. తాత్కాలికంగా నైనా సమస్యలని మర్చిపోవచ్చు. అంతవరకైతే ఫర్వాలేదు. సమస్యలనుండి కాస్తంత ఉపశమనం పొందడానికి అక్కడకు వెళ్తే పూనకం పేరుతో దేవుడు అవి కావాలన్నాడు... ఇవి కావాలన్నాడు అని చెప్పి, వచ్చిన వాళ్లని మొహమాటంలో పెట్టేసి కనకాన్ని... కానుకల్ని వసూలుచెయ్యడం... ఇదంతా దోపిడి అని... అమానుషం అని...నే ననుకుంటూ ఉంటాను.

మరి కొంతమంది అమ్మలని, బాబాలని అందర్నీ గుడ్డిగా నమ్మేసి మోసపోతూ వుంటారు. అది మోసం అని కూడా గ్రహించలేనంత అమాయకులు వాళ్లు. "నా భక్తి లోనే ఏదో లోపం వుంది" అని మనసులో బాధ పడతారే తప్ప నమ్మడం మానరు...

జయంతి అప్పుడప్పుడు ఫోన్ చేస్తున్నాది. అలా మరో నెల రోజులు గడిచి పోయాయి. ఒకరోజు జయంతి ఫోన్ చేసింది.

"మాధవీ! రేపు మా యింట్లో స్వామీజీకి పాదపూజ చేస్తున్నాం. నువ్వు తప్పకుండా రావాలి" అని.

రాత్రి ప్రకాష్ నాతో అన్నారు: "రేపు నీ నేస్తం జయంతి వాళ్లింట్లో ఏదో ఫంక్షన్ వుందట కదా. దాని కోసమని ఆవిడ భర్త విజయ్ కుమార్ మార్వాడీ దగ్గర వందకి నెలకి అయిదు రూపాయల వడ్డీ చొప్పున పదివేల రూపాయలు అప్పు తీసుకున్నాడు".

"అయ్యో! అదేమిటి? మా జయంతికి 'బాబా'లూ 'మాతాజీ'లూ అంటే నమ్మకాలూ శ్రద్ధా ఉన్నాయని తెలుసుగాని ఇలా వడ్డీలకి అప్పులు చేసి పూజలు జరిపించాల్సిన అవసరం ఏమొచ్చింది? ఏమిటో ఇలాంటి వాళ్ల మనసుల్ని మార్చడం చాలా కష్టం సుమండీ." అన్నాన్నేను.

సాయంత్రం అయిదు గంటలకి వెళ్లాను వాళ్లింటికి. ఇల్లంతా వచ్చిన వాళ్లతో హడావిడిగా వుంది.

హాలంతా రంగురంగుల కాగితాలతో అందంగా అలంకరించారు.

ఒక పెద్ద పళ్లెంలో గులాబీలు, చేమంతులు వున్నాయి. మరొక పళ్లెంలో అరటిపళ్లు, ఏపిల్ పళ్లు వున్నాయి.

పక్కనే అయిదు వెండి గిన్నెలున్నాయి. పంచామృతాలక్కావల్సిన పాలు, పెరుగు, నెయ్యి, తేనె వగైరాలన్నీ వీటిల్లో వున్నాయి.

ఒక సింహాసనం లాంటి కుర్చీ అద్దెకి తెచ్చి వేసారు.

పాదాలు పెట్టుకునే చోట ఒక చిన్న పీట వేసి దానిమీద పువ్వులు జల్లి వుంచారు.

పక్కనే మరొక పళ్లెంలో స్వామీజికివ్వాల్సిన పట్టు పంచెలచాపు వుంది. అందరూ స్వామీజీ కోసం ఎదురు చూస్తున్నారు.

పాద పూజకి అన్నీ రెడీ చేసింది జయంతి. రెండు పెద్ద గిన్నెల్లో పులిహోర, చక్కెర పొంగలి ఘుమఘుమలాడుతున్నాయి. అగరువత్తుల పరిమళం ఆ హాలంతా వ్యాపించింది మత్తుగా.

విజయకుమార్ గారు టాక్సీలో స్వామీజీని తీసుకువచ్చారు.

టాక్సీ అల్లంత దూరంలో ఆగగానే అందరిలో ఆత్రం ఎక్కువైంది. వెనక మరో టాక్సీలో స్వామీజీ శిష్యులు దిగేరు.

టాక్సీ నించి స్వామీజీ చెప్పులతో దిగి కొంతదూరం నడిచి వచ్చారు.

వీధి గుమ్మంలోనే ఆయన చెప్పుల్ని విప్పేసి పక్కన పెట్టారు. ఆయన చెప్పుల్ని పదిలంగా లోపలికి తీసుకు వచ్చారు ఆయన శిష్యులు.

ఆయన పాదాల్ని ఎవరూ తాకకూడదట. దూరం నించే ఆయన పాదాలు కడిగి ఆ నీళ్ల శిరస్సున జల్లుకున్నారు జయంతి దంపతులు.

స్వామీజీని స్వాగత వచనాలతో సాదరంగా లోపలికి తీసుకువచ్చారు.

జయంతి ముఖం సంతోషంతో వెలిగిపోతున్నాది. పెట్రొమాక్స్ లైటులాగ! కట్టుకున్న కొత్త పట్టుచీర పమిట చెంగుని, స్టెప్స్ దగ్గర వున్న జరీ అంచుల్ని సరిచేసుకుంటూ గర్వంగా చుట్టూ చూసింది జయంతి.

స్వామీజీ విప్పిన చెప్పుల్ని పువ్వులు జల్లిన పీటమీద ఒక పళ్లెంలో వుంచి పాలతో ఆ చెప్పుల్ని కడిగి ఆ పాలని ఒక వెండి గిన్నెలో పోసి అందరికీ తీర్థంలా యిస్తున్నారు.

ఆయన వాడుతున్న చెప్పుల్ని పాలతో కడగడం ఏమిటి?! ఆ పాలను తీర్థంలా సేవించడం ఏమిటి?! అని నాకు కొంచెం మనో బాధ కలిగింది. నా కడుపులో వికారం లాంటిది మొదలైంది.

నా దగ్గరకు తీర్థం తీసుకువచ్చారు ఎవరో. నేను తీసుకున్నానని అబద్ధం చెప్పాను.

అసలు అక్కడున్న ఎవరూ ఈ తతంగాన్ని కొంచెం కూడా ఎదిరించడం లేదేమిటి? వాళ్లకి ఏమీ అనిపించడం లేదా? లేదా, నిజంగానే భక్తి పారవశ్యంలో పడి అలా చెయ్యడాన్ని పట్టించుకోవడం లేదా?!

భక్తి... అంటే మరీ యింత ఘోరంగా వుండాలా?!!!

నా మనసులో అర్థంకాని చిక్కు ప్రశ్నలెన్నో ఉదయించాయి.

స్వామీజీ వెంట తొమ్మిది మంది శిష్యులు వచ్చారు. నేను వాళ్లని కూడా పరికించి చూస్తున్నాను.

ఇద్దరు శిష్యులు బయటకు వెళ్లారు. ఒక కాయితం మీద ఏదో రాసి, ఆ కాయితాన్ని, కొంత డబ్బుని రెండోవాడికిచ్చి పంపడం, ఆ శిష్యుడు లోపలికి వచ్చి విజయకుమార్ గారి చేతిలో ఆ డబ్బు వుంచి ఏదో చెప్పడం- ఆనకు వింతగా, కుతూహలంగా కనిపించింది. విజయకుమార్ గారు మైక్ దగ్గరకు వచ్చి "ఎవరో అజ్ఞాత భక్తులు స్వామీజీకి వెయ్యి రూపాయలు కానుకగా సమర్పించారు. వారికి ఆ భగవంతుడు ఆయురారోగ్య అష్ట ఐశ్వర్యాలనిచ్చి కాపాడుగాక!" అన్నాడు.

వెంటనే పక్కనున్న శిష్యుడు మైక్ అందుకుని "ఇంకా ఎవరైనా భక్తులు కానుకలు సమర్పించుకోవాలంటే సమర్పించుకోవచ్చు. అట్టివారు స్వామివారి కృపకు పాత్రులవుతారు." అన్నాడు. "ఈ స్వామీజీ తన శిష్యులతో కలిసి ఒక పన్నుగడతో ధన సంపాదన చేస్తున్నట్టు నాకు తోచింది. ఈ పన్నుగడ ఎంత తేలికగా అమలు పరుస్తున్నారో అంత దుర్భేద్యంగా కూడా ఉంది." అని నాకు అనిపించింది.

మైక్‌లో అది వినగానే అక్కడున్న భక్తుల్లో కలకలం బయలుదేరింది. ఎవరు ఎంత ఎక్కువ డబ్బు స్వామివారికి కానుకగా చదివిస్తే వాళ్లు అంత గొప్ప భక్తులన్న భావం కలిగి భక్తుల్లో పోటీ పెరిగింది. వంద, రెండు వందలు, అయిదు వందలు, వెయ్యి- వాళ్ల శక్తికి మించి స్వామీజీకి సమర్పించుకుంటున్నారు! స్వామీజీ ఏభై రూపాయల కంటె ఎక్కువ యిచ్చిన భక్తులందరి పేర్లు మైకులోనే చదివి దీవించేస్తున్నారు. స్వామీజీకి డబ్బు పుష్కలంగా పోగుపడింది. ఆయన ముఖంలోకి వింత వెలుగు వచ్చింది.

మైక్‌ని తిరిగి చేతిలోకి తీసుకుని "భక్తులారా! మీ ఆదరాభిమానాలకీ, మీ భక్తి తత్పరతకి నా మనసు పులకించింది. ఆ భగవంతుని అనుగ్రహం సదా మీయందు వుండాలని ఆశిస్తున్నాను. భక్తులున్న చోట భగవంతుడు వుంటాడంటారు. ఇక్కడ నా నేత్రాలకి ఆ దేవదేవుడు... ఆ పరమేశ్వరుడు... కనిపిస్తున్నాడు. నేను ఆ భగవంతుడ్ని స్పష్టంగా చూడగల్గుతున్నాను" అనగానే ఒకరి తరువాత మరొకరుగా ఆయనకి సాష్టాంగ పడిపోవడం మొదలు పెట్టారు. జయంతి

దంపతులు స్వామీజీ శిష్యులు ఒక్కొక్కరికీ నూట పదహార్లు, ఒక శాలువ బహూకరించారు. స్వామీజీకి అయిదువేల రూపాయలు, పట్టుపంచెల చాపు బహూకరించి సాష్టాంగపడ్డారు. స్వామీజీ చిరునవ్వులు చిందిస్తూ వాళ్లని ఆశీర్వదించారు.

జయంతి నవ్వుతూ నావైపు చూసింది. ఆ నవ్వు స్వచ్ఛంగా లేదు! ఏదో కృత్రిమంగా అనిపించింది నాకు. మరి అక్కడ వుండాలనిపించలేదు. ప్రసాదం పుచ్చుకుని యింటికి వచ్చేసాను.

ఇదంతా నాకు నచ్చని వ్యవహారం!

ఇదొక అందమైన దోపిడీ కావచ్చునని నాకు మరోసారి తోచింది.

మూర్ఖత్వంతో, అజ్ఞానంతో, మూఢ భక్తిలో పడి ఆలోచనా శక్తిని కోల్పోయిన ఇలాంటి వాళ్లని ఏ దేవుడు రక్షిస్తాడు?!

ఇంటికొచ్చాక జరిగినదంతా ఆయనకి చెప్పాను.

"నువ్వు అసలు ఎందుకు వెళ్లావు అలాంటి చోటుకి?! వెళ్లడం, విమర్శించడం, మనసు పాడుచేసుకోవడం అలవాటయిపోయింది నీకు! అజ్ఞానం చెడ్డతనం కాదు. మోసం చేసేవాళ్లు కూడా, నమ్మిన వాళ్లు వుంటేనే కదా మోసం చేస్తారు! అయినా ఎవరి ఖర్మకి ఎవరు కర్తలు!? అది పాపమో, పుణ్యమో, అజ్ఞానమో... ఏదో ఒకటి మనం వాళ్ల జోలికి వెళ్లకపోవడమే మంచిది". అంటూ నన్నే కోప్పడ్డారు.

నాకు ఏడుపొచ్చింది. జరిగిన సంఘటనల్ని నా మనసు జీర్ణించుకోలేక పోతున్నది. జయంతికి నచ్చజెప్పాలని కోరిక కలిగిందిగాని మరుక్షణం అది మొండి గోడతో మాట్లాడ్డం లాంటిదని తోచింది.

వారం రోజుల తరువాత ఒకనాడు నేను "ఉదయం వంట కార్యక్రమం"లో సమయం చాలక, ఉపాయాలు తోచక, మధ్య మధ్య కరెంటు పోతూ మిక్సీ పనిచెయ్యక - సతమతం అవుతున్నప్పుడు; "మమ్మీ! డాడీ నిన్నిది అర్జంటుగా చూడమన్నారు!" అని ఒక న్యూస్‌పేపరు అక్కడ డైనింగ్ టేబిలుమీద పడేసి వెళ్లేడు. పేపరు అందంగా, పద్ధతిగా మడతపెట్టి ఉంది. ఒకవార్తని చక్కగా "మార్కర్‌పెన్" లో "హైలైట్" చేసేరు. మావారు. ఆ శ్రద్ధ చూస్తే పని ఆపేసి ఆ వార్త చదవాలనిపించింది.

"జనార్దన స్వామిగా చెలామణీ అవుతున్న ధనార్జన స్వామి గుట్టురట్టు" అని ఆవార్త టైటిలు. వివరాలన్నీ నాకు ఇదివరకు తోచినవే. చిత్రం ఏమిటంటే; విజయకుమార్ గారు జయంతికి జ్ఞానోదయం కలిగించడానికే ఆరోజు కార్యక్రమం ఏర్పాటు చేసి, ఆ వివరాలన్నీ పోలీసులకి తెలియజేసి స్వామీజీని శిష్యుల్నీ కటకటాల వెనక్కి పంపేరు!

★ ★ ★

*(అముద్రితం)*